చెత్తను రిక్షా సిబ్బందికి మాత్రమే ఇవ్వాలి



జీహెచ్ఎంసీ సిబ్బందికి చెత్త రిక్షాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: చెత్త సేకరణ కోసం ఇంటింటికీ వచ్చే జీహెచ్ఎంసీ సిబ్బందికి మాత్రమే చెత్తను ఇవ్వాలని.. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని కార్పొరేటర్ ఉమారాణి ప్రజలను కోరారు. రోడ్లపై చెత్తను పడేసి పరిసరాలను అపరిశుభ్రం చేయొద్దన్నారు. శుక్రవారం చెత్త సేకరణ సిబ్బందికి ఆమె రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ తిరుపతి నాయక్, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రామకృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానామృతం



గాయకులను సన్మానిస్తున్న చంద్రతేజ

చిక్కడపల్లి: చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ సంస్థ వారు సృష్టి ఆర్ట్స్ అభినందనలతో శుక్రవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన పద్మశ్రీ 'ఘంటసాల గానామృతం' కార్యక్రమం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు చంద్రజేత లతో పాటు వీఏ.లక్ష్మి, ఏవీ రమణ, పి.అనంత లక్ష్మి, తదితరులు ఘంటసాల గీతాలను మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభలో గాయనీగాయకులను చంద్రతేజ సన్మానించి అభినందించారు.

మండప ఏర్పాటు పూజ



పూజల్లో పాల్గొన్న ఆకుల అరుణ్ తదితరులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ కమలనెహ్రూనగర్ బద్దిపోచమ్మ దేవాలయం వద్ద ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దుర్గామాత మండప పూజను ముషీరాబాద్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల అరుణ్‌కుమార్ పూజలు చేసి ప్రారంభించారు. శుక్రవారం దుర్గామాత మండప ఏర్పాటు పనులను ప్రారంభించి మాట్లాడారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా దేవినవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, కిరణ్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత వీహెచ్‌ను కలిసిన ఎంకేఎస్ నేతలు



వి.హనుమంతరావుకు సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న ఎంకేఎస్ నేతలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావును శుక్రవారం మున్నూరుకాపు సంఘం (ఎంకేఎస్) రాష్ట్ర కార్యదర్శి ఇందూరి తిరుపతి పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యత్వ పత్రాన్ని వీహెచ్‌కు అందజేశారు. తిరుపతి పటేల్ మాట్లాడుతూ.. వీహెచ్ మున్నూరుకాపు ముద్దుబిడ్డ అని అన్నారు. అందరూ ఆయనను మున్నూరుకాపు భీష్మమహా అని పిలుచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కడుదల సోమయ్యపటేల్, గౌని సత్యనారాయణ, సకినాల నర్సింగ్‌రావు, మల్లెల పాపరావు, గౌని రాములు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ నియామకాల్లో 130 మంది విద్యార్థులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూలోని సీఎఫ్ఆర్డీ భవనం ఈ క్లాస్ రూంలో ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ క్యాంపస్ నియామక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయా చరణ్, కోఆర్డీనేటర్ డా.యూ. సూర్యవల్లి ప్రారంభించారు. అనంతరం ఈ డ్రైవ్‌లో దాదాపు 130 మంది ఎమ్మెస్సీ విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్, రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్స్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ ప్రతినిధులు తెలిపారు.

అధ్వానంగా సుందరయ్య పార్కులోని చిన్నారుల ఆటస్థల ప్రాంగణం



మూలనపడ్డ ఆట పరికరాలు..!

- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- తల్లిదండ్రులతో పార్కుకు వచ్చే చిన్నారులకు నిరాశే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట పరికరాలు విరిగిపోయాయి. పది నెలలుగా ఆట పరికరాలన్నీ అలాగే ఉన్నాయి. సంబంధిత అధికారులు వాటి మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. రెండేళ్ల క్రితం ఉయ్యాల, జారుడు బండ, భూ చక్రం తదితర పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఏడాది తిరిగే లోపే అవి ఎందుకు పనికి రాకుండా పోయాయి. ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాలకు సంబంధించిన ఏకైక పెద్ద పార్కు ఇదొక్కటే. తల్లిదండ్రులతో పార్కుకి వచ్చే పిల్లలు వీటిని చూసి నిరాశకు గురవుతున్నారు. పిల్లలు ఆడుకున్న ఈ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా మారింది.



పట్టించుకోని అధికారులు..

◆ జీహెచ్ఎంసీ అధికారులు ఆట పరికరాలు మూలనపడినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. గంపెడాశతో పార్కుకి వచ్చే పిల్లలకు నిరాశే మిగులుతోంది. పిల్లల ఆట పరికరాలపై ఇంత నిర్లక్ష్యం వహిస్తే ఎలా వాకర్స్ ప్రశ్నిస్తున్నారు.

పార్కుకి అందమే పోయింది



ఈ పార్కులో చిన్న పిల్లల ఆటవస్తువులపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిన్న పిల్లల ఆట పరికరాలు మూలనపడటంతో ఈ పార్కుకే అందం పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలన పడిన ఆట పరికరాలను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎం. దామోదర్‌రెడ్డి

పిల్లల ఆట పరికరాలపైన దృష్టి సారించాలి



ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు ఆట పరికరాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి. మా పార్కు అసోసియేషన్ తరుపున కూడా కృషి చేస్తున్నాం.

– పీవీ నిరంజన్‌రెడ్డి, సుందరయ్య పార్కు అధ్యక్షుడు

సామాజిక భవనాలను ఆధునీకరిస్తాం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని సామాజిక భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా అన్ని సౌకర్యాలతో ఆధునీకరిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గంగపుత్రకాలనీలో రూ.13 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఉపాధి శిక్షణ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు మరింత ఉపయోగపడే విధంగా ఏర్పాట్లు చేసేందుకు నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, ప్రహరీ, ఫెన్సింగ్, కమ్యూనిటీహాల్‌పై మరో అంతస్తు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతీ కమ్యూనిటీహాల్‌లో స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి రంగాలలో శిక్షణ



గంగపుత్రకాలనీ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు టి.సోమన్, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, బల్వంత్, నర్సింగ్‌రావు, నాని, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'కళాసేవ, ధర్మం' ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది

పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి

చిక్కడపల్లి: 'కళాసేవ, ధర్మం' ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి చెప్పారు. శుక్రవారం లత్యాగారాయ గానసభ ప్రధాన వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు జన్మదిన వేడుకలు కనులపండుగగా జరిగింది. ముఖ్యఅతిథిగా విద్యా శంకర భారతీస్వామి హాజరై ల్గొని విదేశాలలో తెలుగు సంస్కృతి, భాష వ్యాప్తికి కృషి చేస్తున్న వంగూరి చిట్టెన్ రాజు(అమెరికా), వామరాజు సత్యమూర్తి(సింగపూర్), బూరుగుపల్లి వ్యాసకృష్ణ(ఉగాండా)ను సత్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ... వంశీ రామరాజు తన



వంశీ రామరాజు దంపతులకు కిన్నెర జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న భారతీస్వామి

జన్మదినం సందర్భంగా విదేశాల్లో తెలుగు సంస్కృతిక వికాసానికి కృషి చేస్తున్న వారిని సత్కరించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ప్రముఖులు రేలంగి నరసింహారావు, తుమ్మల రామసత్యనారాయణ, ధర్మారావు, లంకా లక్ష్మీనారాయణ, లోకం కృష్ణయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం గుర్తింపునివ్వాలి


కాచిగూడ: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణగూడలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని, బీసీ ఉద్యోగులకు అప్రాధాన్యత పోస్టులు ఇచ్చి, అగ్రవర్ణాలకు ప్రాధాన్యత పోస్టులు ఇవ్వడం బాధాకరమని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులందరినీ సమాన ప్రాధాన్యత పోస్టుల్లో నియమించాలని కోరారు. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమాచారం అన్ని విభాగాల శాఖాధిపతులు వివరాలను వెంటనే బీసీ కమిషన్‌కు ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్

మంజూరు చేయాలన్నారు. రిటైర్ అయిన వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను రిలీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమా, అసోసియేట్ అధ్యక్షులు వారాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాసూరు జ్ఞానేశ్వర్, సుంకరి శ్రీనివాస్, అనురాధ, మహేంద్ర సాగర్, యాదయ్య, సోఫీ, పాషా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలి



వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మాల మహార్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి సమావేశంలో అభివాదం చేస్తున్న దయానంద్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చట్ట వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని నేషనల్ మాల మహార్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మాస్టార్ దయానంద్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ దయానంద్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన మాల ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా వ్యవహరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చారని మండిపడ్డారు. సీఎం తన వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఎస్సీ కులాలను వర్గీకరించి మాల సామాజిక యువతకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయకుంటే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వర్కింగ్ చైర్మన్ వెంకటస్వామి, వి.శ్రీనివాస్, కోచైర్మన్ నర్మెట్ మల్లేష్, పద్మారావు, కాంతయ్య, మారుతి, వెంకటయ్య, కె.లక్ష్మణ్, లలిత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో కవచ్‌ను వేగంగా విస్తరించాలి

రైల్వే బోర్డు మానవ వనరుల డైరెక్టర్ జనరల్ ఆర్.రాజగోపాల్

లాలాపేట: ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ (ఇరిసెట్)ను శుక్రవారం రైల్వే బోర్డు మానవ వనరుల డైరెక్టర్ జనరల్ ఆర్. రాజగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ ఇతర అధికారులతో కలసి ఇరిసెట్‌లోని ఆయా విభాగాల పనితీరును, శిక్షణా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. భారతీయ రైల్వేలో కవచ్‌ను అమలు చేస్తున్న పరిజ్ఞానానికి ఇరిసెట్‌లో అధికారులు, సూపర్‌వైజర్లు, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది చేస్తున్న కృషిని తెలియజేశారు. దీంతో పాటుగా ఇరిసెట్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. రైల్వేలో కవచ్‌ను మరింత పటిష్టంగా, వేగంగా విస్తరించాల్సిన ఆవశ్యకతపై రాజగోపాల్ ట్రైనీ అధికారులతో మాట్లాడారు. కవచ్ లాబొరేటరీలోని పరికరాలను సందర్శించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ పాండే, ఇరత విభాగాల అధికారులున్నారు.

గోవధ నిషేధిత చట్టం తెచ్చి ఆమోదించాలి

హిమాయత్‌నగర్: గోవధ నిషేధిత చట్టం తీసుకొచ్చి పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించాలని బీజేపీ సీనియర్ నాయకుడు చీకోటి ప్రవీణ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై బీజేపీ ఎంపీలపై ఒత్తిడి తీసుకొస్తానని తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నమో మిషన్ వందే గో మాతరం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా చీకోటి ప్రవీణ్ హాజరై మాట్లాడారు. గోవును రక్షించాలనే ఉద్దేశంతో ధర్మరక్షను ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరారు. సుప్రీమ్ కోర్ట్ ఉత్తర్వులను ధిక్కరిస్తూ ఓవైసీ సోదరులు ఇష్టారీతిన గోవధను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. గోవధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, పీడీ యాక్ట్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నమో మిషన్ వందే గో మాతరం ప్రతినిధులు కవిత హైందవి, పూర్ణ శాంతి గుప్తా, సురేష్ కుమార్, వీర మద్వీరాజ్, భరత్ కుమార్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, ఉదయ్ శ్రవణ్, దత్తు, విజయ్ మోజ్, గంప ప్రేమ్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో వేధించొద్దు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థుల హాస్టల్, మెస్, కాలేజీ రెన్యూవల్ పేరుతో ఫీజులు వసూలు చేసే పద్ధతిని విరమించుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డిని, ఓయూ ప్రొఫెసర్ జితేందర్ నాయక్‌ను, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులను కలసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి, గ్రేటర్ అధ్యక్షుడు వెంకటేష్, ఓయూ నాయకులు విజయ్‌కుమార్, బాలకృష్ణ తదితరులున్నారు.

రైల్వేస్టేషన్‌లో బ్యాగ్ చోరీ

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం నం. 4పై పెట్టిన బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కేరళకు చెందిన మహ్మద్ ఫరీద్ (24) కేరళకు వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై ట్రైన్‌కోసం వేచి ఉన్నాడు. తన వెనుక వైపు పెట్టుకున్న బ్యాగును దొంగిలించారు. బ్యాగులో రూ.9వేల నగదు, బట్టలు ఉన్నాయి. బాధితుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో విష్ణు(25) రైలు ఎక్కాడు. రైలు ఎక్కిన తర్వాత చూసుకునే సరికి జేబులోని సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో బాధితుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు దేశానికి ఆధార స్తంభాలు

రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. పురుషోత్తం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రొ.పురుషోత్తం, ప్రొ.ప్రదీప్‌కుమార్

చిక్కడపల్లి: సమాజానికి మార్గనిర్దేశనం చేసే ఉపాధ్యాయులను గౌరవించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. తులసి భవన్ డివోషనల్ లిటరసీ, కల్చరల్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త ప్రొ. ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లను ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం ముఖ్యఅతిథిగా విచ్చేసి సత్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు దేశానికి ఆధార స్తంభాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువుదేనని అన్నారు. తులసి భవన్ డైరెక్టర్ ప్రొ. ప్రదీప్‌కుమార్ విద్యావేత్తగా, నటుడిగా విద్యా కళారంగాలకు తనవంతు సేవలు అందించడం ఆదర్శనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆచార్య బి.రాధ, ఆచార్య రత్నశ్రీ డా. భవాని, డా. హెచ్‌కే వందన, డా. కె.వెంకటేశ్వర్లు(సంస్కృతం) ఎం.భవాని, కిరణ్, విజయకుమార్ జాదవ్, యశోద, రిజ్వాన బేగం, శేషుబాబు, కిషన్, సుమనలత, శుభద, దారేశ్వరి, ప్రవీణ్‌బాబు తదితర 40 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రదీప్ కుమార్, వందనలు ప్రదర్శించిన భారతీయ హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

బీఆర్ఎస్ హయాంలోనే టీఎస్‌పీఎస్సీలో భారీ అక్రమాలు

కాచిగూడ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలను టీపీసీసీ వైస్‌ప్రెసిడెంట్ నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో భారీ అక్రమాలు బయటపడ్డాయని ఆయన పేర్కొన్నారు. గ్రూప్–1, సింగరేణి, ఈఎంసెట్, పదో తరగతి వంటి పరీక్షల్లో పేపర్ లీకులు విస్తృతంగా జరిగాయని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీకుల కారణంగా సుమారు 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. పేదలకు విద్యను దూరం చేయాలనే కుట్రతోనే కేసీఆర్ ప్రభుత్వం పలు ప్రభుత్వ పాఠశాలలను మూసివేశాడని ఆరోపించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే పేద పిల్లల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఉపాధ్యాయ నియామకాల కోసం కేవలం 55 రోజుల్లోనే 11,000 మంది టీచర్లను నియమించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

50శాతం పరిమితిని ఎత్తివేసే బిల్లును ఆమోదించాలి

కాచిగూడ: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచేందుకు 50 శాతం పరిమితిని ఎత్తివేసే బిల్లును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెంటనే ఆమోదించి బీసీలకు తగిన న్యాయం జరిగే విధంగా చూడాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా పంచాయతీరాజ్ చట్టం–2018, పురపాలన చట్టం–2019లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తూ ప్రవేశపెట్టిన సవరణ బిల్లులను అసెంబ్లీ ఆమోదించిందన్నారు. కొత్త మున్సిపాలిటీలు, పంచాయతీ ఏర్పాటు బిల్లులను ఆమోదించిన గవర్నర్ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బిల్లలను ఆమోదించకపోవడం అన్యాయమని అన్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ నేతలు ప్రదీప్‌గౌడ్, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

చేనేత వస్త్రాలను ధరించండి..

ఉపాధి కల్పించండి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి హస్త కళాకారులకు ఉపాధిని కల్పించాలని హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీని ఆదుకోవాలని ప్రోత్సహించాలని ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, టెస్కో వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజ రామయ్య విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం టెస్కో ఆధ్వర్యంలో రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగంపై ఆధారపడిన చేనేత కళాకారులు తయారు చేసిన నాణ్యమైన వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించటం, వినియోగదారులకు నాణ్యమైన చేనేత వస్త్రాలు సరసమైన ధరలకు అందించటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర చేనేత సహకార సంఘం పని చేస్తుందన్నారు.

◆ సెప్టెంబర్ 12వ తేదీ నుంచి నవంబర్ 11వ తేదీ వరకు రెండు నెలల పాటు కొనసాగే ఈ వస్త్ర ప్రదర్శనలో 50 శాతం, 60 శాతం, 70 శాతం ప్రత్యేక తగ్గింపు ధరలలో అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత వస్త్రాలైన పోచంపల్లి, ఇక్కత్, గద్వాల, నారాయణపేట,న గొల్లభామ పట్టుచీరలు, సీకో చీరలు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ రెడిమేడ్స్, లుంగీలు, టవల్స్, దుప్పట్లు, కలంకారి, ఖాదీ వస్త్రాలతో పాటు రాజమండ్రి, వెంకటగిరి, బందరు, ధర్మవరం చీరలు ప్రదర్శనకు ఉంచామని అన్నారు.

◆ ఈ అవకాశాన్ని రాంనగర్ పరిసర ప్రాంతాలలోని ప్రజలతో పాటు జంట నగరాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన చేనేత వస్త్రాలు అతి తక్కువ ధరలలో పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెస్కో మేనేజింగ్ డైరెక్టర్ రఘునందన్‌రావు, ఓఎస్‌డీ రతన్ కుమార్, టెస్కో ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డివిజనల్ మార్కెటింగ్ అధికారి కళింగరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు సందీప్‌జోషి, కేటీ చారి, మాధవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న శైలజరామయ్య